
సాక్షి
ఆదిలాబాద్
మంగళవారం ● 13 ● ఆగస్టు ● 2024



లెఫ్టూ.. రైటే!

కుడిచేతి వాటం వారి కన్నా ఎడమచేతి వాటం వారు ప్రత్యేక స్థానాల్లో ఉంటారని అంచనా. నేడు లెఫ్ట్ హ్యాండర్స్ డే సందర్భంగా కథనం. 8లో▸

నేడు జిల్లా బంద్

ఆదిలాబాద్‌టౌన్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడికి నిరసనగా చాంబర్ ఆఫ్ కామర్స్, ట్రేడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా బంద్ చేపడుతున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కమల్ కిశోర్ అగర్వాల్, గండ్రత్ సంతోష్ ప్రకటనలో తెలిపారు. బంద్‌లో వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గరిష్టం/కనిష్టం
32.0/26.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

రిమ్స్‌లో మరో నాలుగు డయాలసిస్ యంత్రాలు


మిషన్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్ జైసింగ్

ఆదిలాబాద్‌టౌన్: కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మరింత సేవలు అందించేందుకు గాను మరో నాలుగు డయాలసిస్ యంత్రాలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన యంత్రాల పనితీరును సోమవారం పరిశీలించారు. రెండు, మూడు రోజుల్లో వీటిని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 11 యంత్రాలు ఉండగా, వీటితో కలుపుకొని 15 అందుబాటులోకి రానున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 6 నుంచి రాత్రి 12 గంటల వరకు నాలుగు షిఫ్టుల్లో డయాలసిస్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎఫెక్స్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో రోగులకు ఈ సేవలను అందిస్తున్నట్లు వివరించారు. ఆయన వెంట వైద్యుడు తిప్పస్వామి, డయాలసిస్ విభాగం ఇన్‌చార్జి ప్రేమ్, రవి, అశ్విన్ ఉన్నారు.

17 మంది వైద్యుల నియామకం

ఆదిలాబాద్‌టౌన్:రిమ్స్‌లో 17మంది వైద్యులను నియమించినట్లు డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. ఇటీవల ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టుల కోసం ఇంటర్వ్యూ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ ఇంటర్వ్యూకు 31 మంది హాజరవగా 17 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇందులో ఒక ప్రొఫెసర్, నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు సీనియర్ రెసిడెంట్లు,10 మంది ట్యూటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇందులో ముగ్గురు వైద్యులు సోమవారం విధుల్లో చేరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు గాను ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఈనెల20లోగా ఎంఈవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను మండల విద్యాధికారులు ఎంపిక చేసి ఈనెల 24లోగా డీఈవో కార్యాలయంలో వివరాలు సమర్పించాలని పేర్కొన్నారు. గతంలో అవార్డు పొందినవారు, కేసులు ఉన్న ఉపాధ్యాయులను ఎంపిక చేయవద్దని సూచించారు. వివరాల కోసం డీఈవో కార్యాలయ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని పేర్కొన్నారు.

టీపీసీసీ కమ్యూనికేషన్ స్టేట్ కోఆర్డినేటర్‌గా శ్రీధర్

కైలాస్‌నగర్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కమ్యూనికేషన్ విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్‌గా మావల మండలం వాగాపూర్ గ్రామానికి చెందిన భూపెల్లి శ్రీధర్ నియామకమయ్యారు. ఈ మేరకు ఆ విభాగం రాష్ట్ర చైర్మన్ సామ రాంమోహన్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పొరపాట్లు లేకుండా ఓటరు జాబితా రూపొందించాలి

కైలాస్‌నగర్:గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా రూపొందించాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. ఓటర్ల జాబితా తయారీపై జెడ్పీ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల హైదరాబాద్‌లో శిక్షణపొందిన మాస్టర్ ట్రైనర్ ఓటరు జాబితా తయారీ విధానంపై అవగాహన కల్పించారు. ఇందులో జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత, డివిజనల్ పంచాయతీ అధికారి ఫణీందర్‌రావు పాల్గొన్నారు.

టూర్ డైరీ అందజేయాలి

ప్రతి జిల్లా అధికారి తమ టూర్ డైరీని అందజేయాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. వ్యవసాయ, పశుసంవర్ధక, విద్యాశాఖ అధికారులు టూర్ డైరీలు అందించకపోవడంపై వారిని ప్రశ్నించారు. మంగళవారం ఉదయం అందజేస్తామని సదరు అధికారులు చెప్పడంతో మిగతా వారంతా విధిగా అందజేయాలని సూచించారు. అలాగే ప్రజావాణి దరఖాస్తుల ప్రగతి వివరాలపై ఆరా తీశారు. పలు శాఖల్లో పదుల సంఖ్యలో పెండింగ్ ఉండటంపై వారిని ప్రశ్నించారు. ప్రతి అర్జీని ఎప్పటికప్పుడు పరిష్కరించడంపై శ్రద్ధ వహించాలన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి ఇతర అధికారులు పాల్గొన్నారు.




జిల్లా పరిషత్ కార్యాలయం

బదిలీలు.. అభాసుపాలు!

- ఇలా ముగియగానే.. అలా అక్రమ డిప్యూటేషన్లు
- పలు శాఖల్లో మొదలైన తంతు
- గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయడానికి అయిష్టత
- పలుకుబడి ఉన్న పోస్టుల్లోకి పైరవీలతో మళ్లీ రాక
- జెడ్పీలో రెండే సూపరింటెండెంట్ పోస్టులు.. వచ్చిన మూడో అధికారి!

సాక్షి,ఆదిలాబాద్: బదిలీల పర్వం ముగిసిందో లేదో ఇక అక్రమ డిప్యూటేషన్ల తంతు మొదలైంది. ఆదిలాబాద్ జెడ్పీలో రెండు సూపరింటెండెంట్ పోస్టుల మంజూరు ఉంది. ఇందులో జీపీఎఫ్ వి భాగంలో పనిచేస్తున్న అధికారి సుధాకర్‌కు ఇటీవల బదిలీల్లో స్థానచలనం కలగలేదు. మరో అ ధికారి ఎల్.నర్సింగ్‌రావుకు జైనథ్ మండల పరి షత్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆ స్థానంలో ఇంద్రవెల్లి మండల పరిషత్ కార్యాలయం నుంచి సూపరింటెండెంట్ సి.వేణును ఇక్కడ నియమించారు. ఇక్కడి వరకు బాగానే ఉంది.అయితే ఇదివరకు ఉట్నూర్‌లో రెగ్యులర్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఆదిలాబాద్ జెడ్పీలో ఎస్టాబ్లి ష్మెంట్ సెక్షన్ అధి కారిగా డిప్యూటేషన్‌లో కొనసాగుతున్న ఈ.వెంకటేశ్వర్లుకు మొన్నటి బదిలీల్లో నేరడిగొండ మండల పరిషత్ కార్యాలయానికి స్థాన చలనం జరిగింది. అక్కడ ఇలా చేరి.. అలా డిప్యూటేషన్ ద్వారా మళ్లీ వెంకటేశ్వర్లు జెడ్పీ ఎస్టాబ్లిష్మెంట్ సెక్షన్‌కు వచ్చేశారు. బాధ్యతలు కూడా తీసుకున్నారు. ఇక బదిలీపై ఇక్కడికి వచ్చిన రెగ్యులర్ అధికారి వేణుకు అనామక సెక్షన్ బాధ్యతలు అప్పగించారు. దీన్నిబట్టి బదిలీ తంతుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ డిప్యూటేషన్ల ద్వారా అనువైన వారిని పలుకుబడి పోస్టులో కూర్చోబెట్టేందుకు ఉన్నతాధికారులు సైతం వెనుకాడటం లేదని స్పష్టమవుతుంది.

ఈ ఒక్కటే కాదు..

జెడ్పీలో పలు జూనియర్ అసిస్టెంట్లను వివిధ మండలాల నుంచి డిప్యూటేషన్‌పై ఇటీవలే తీసుకున్నారు. ఇదిలా ఉంటే ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్‌ను లక్ష్మీపూర్ చెక్‌పోస్టుకు అటాచ్ చేస్తూ ఆదిలాబాద్ డీపీఈవో నుంచి ఈ నెల 8న ఆర్డర్ వెలువడింది. అలాగే విద్యాశాఖ లో పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయులను డి ప్యూటేషన్‌పై జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ స్కూల్‌కు కేటాయించారు. ఇవన్ని బదిలీల ప్రక్రియపై బ్యాన్ విధించిన తర్వాత చోటుచేసుకున్నవే కావడం గమనార్హం. ఆయా శాఖల ఉన్నతాధికారులు అక్రమ డిప్యూటేషన్లను తెరపైకి తీసుకురావడం ద్వారా కార్యాలయాల్లో తమకు అనువుగా మలుచుకుంటున్నారనే అపవాదు వ్యక్తమవుతుంది. ఓ డిప్యూటేషన్ వ్యవహారంలో రూ.2 లక్షలు చేతులు మారాయని చెప్పుకుంటున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయడం ఇష్టంలేక..

ఇటీవల జరిగిన బదిలీల్లో గ్రామీణ ప్రాంతాల్లో బదిలీలపై వెళ్లిన వారు పట్టుమని పక్షం రోజులు కూడా పనిచేయకుండానే మళ్లీ పాతస్థానంలోకి వచ్చేందుకు పైరవీలు మొదలుపెట్టారనడానికి జెడ్పీ లో జరిగిన తంతే నిదర్శనంగా నిలుస్తుంది. అంతేకాకుండా జూనియర్ అసిస్టెంట్లు కూడా ఇంద్రవెల్లి, వాగాపూర్, పొచ్చరపాఠశాల,తాంసినుంచి జెడ్పీకి డిప్యూటేషన్‌పై వచ్చారు. రెవెన్యూ, వైద్యారోగ్య, శాఖల్లోనూ ఇవి చోటుచేసుకున్నాయనే విమర్శలున్నాయి.

ప్రభుత్వ శాఖల్లో బదిలీల పర్వం ముగిసి రెండు వారాలు కాకముందే అనువైన పోస్టుల కోసం అక్రమ డిప్యూటేషన్లు తెరపైకి వస్తున్నాయి. డిప్యూటేషన్ వ్యవహారమే ఉండొద్దని ప్రభుత్వం బదిలీల కంటే ముందు వాటిని కొన్ని శాఖల్లో క్యాన్సల్ చేసింది. ఆ తర్వాత ఉద్యోగుల కోసం

అక్రమ డిప్యూటేషన్లు ఇలా..

బదిలీ పాలసీని తీసుకొచ్చి ప్రక్రియ చేపట్టింది. ఇవన్ని జరిగిన తర్వాత ఇప్పుడు పలు శాఖల ఉన్నతాధికారులు అక్రమ డిప్యూటేషన్ల వ్యవహారాలు తెరపైకి తెస్తున్నారు. సాధారణంగా కార్యాలయంలో అవసరం ఉన్న పక్షంలోనే డిప్యూటేషన్‌పై తీసుకోవాలి. ఇలాంటి నిబంధనలు కూడా అసలుకే పట్టించుకోవడం లేదు. జెడ్పీలో రెండే సూపరింటెండెంట్ పోస్టులు ఉండగా, మూడో సూపరింటెండెంట్ అధికారిని ఏ కంగా డిప్యూటేషన్‌పై తీసుకురావడం, గతంలో ఆయన నిర్వర్తించినటువంటి కీలక విభాగాన్ని మళ్లీ అతడికే అప్పగించడం గమనార్హం. రెగ్యులర్ అ ధికారిని అనామక సెక్షన్లు ఇచ్చి ఆ అధికారికి మళ్లీ అదే పోస్టులోకి తీసుకురావడం అనుమానాలకు తా విస్తోంది. కాగా ఒక శాఖలో డిప్యూటేషన్‌పై తీసుకు నే విధానంలో ముందుగా జిల్లా ఉన్నతాధికారికి ప్ర తిపాదన పంపాలి. అయితే శాఖ ఉన్నతాధికారులు ఈ విషయంలో తప్పుదోవ పట్టించేలా ప్రతిపాదనలు చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మూడో అధికారికి అకౌంట్స్ విభాగం



జెడ్పీలో రెండే రెగ్యూలర్ సూపరింటెండెంట్ పోస్టులు ఉన్నాయి. ఎస్టాబ్లిష్మెంట్ సెక్షన్‌లో డిప్యూటేషన్‌పై తీసుకున్న వెంకటేశ్వర్లకు అప్పగించాం. జీపీఎఫ్‌కు ఇదివరకు నుంచి సుధాకర్ సూపరింటెండెంట్‌గా ఉన్నారు. ఇటీవల బదిలీపై వచ్చిన రెగ్యూలర్ సూపరింటెండెంట్ వేణుకు అకౌంట్స్ ఇవ్వడం జరిగింది.

– కళిందిని, ఇన్‌చార్జీ జెడ్పీ సీఈఓ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష

కైలాస్‌నగర్: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆమె ఆయా శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పారిశుధ్య పనుల ప్రగతిపై ఆరా తీశారు. కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగించాలని సూచించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా సరఫరా అవుతున్న పౌష్టికాహారం లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందేలా దృష్టి సారించాలన్నారు. ప్రత్యేకాధికారులు ప్రతిరోజు ఫీల్డ్‌కు వెళ్లాలన్నారు. పట్టణాలు, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించి, వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు పరిసరాల, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. వసతిగృహాల వార్డెన్లతో సమావేశాలు నిర్వహిస్తూ శుభ్రత పాటించేలా చూడాలన్నారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ జిల్లాను ప్రగతిపథంలో నిలుపాలని సూచించారు. అంతకు ముందు కలెక్టరేట్‌కు చేరుకున్న మంత్రికి కలెక్టర్, ఎస్పీలు పూలమొక్కలు అందజేసి స్వాగతం పలికారు. ఇందులో కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అటవీశాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్‌తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా సీతక్క సమావేశం నేపథ్యంలో కలెక్టరేట్‌లో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సమావేశం ముగిసేంతవరకు ప్రధాన ద్వారానికి తాళం వేసి లోనికి ఇతరులేవరని అనుమతించలేదు.

కొవ్వొత్తులతో జూడాల నిరసన



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న జూడాలు

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల కోల్‌కతాలోని ఓ మెడికల్ కళాశాలలో పీజీ వైద్య విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేయడాన్ని నిరసిస్తూ జూనియర్ డాక్టర్లు జిల్లా కేంద్రంలో నిరసన చేపట్టారు. సోమవారం రాత్రి రిమ్స్ వైద్య కళాశాల నుంచి కుమురంభీంచౌక్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. జూడాల సంఘం ప్రతినిధి సందీప్‌చార్య మాట్లాడుతూ వైద్య విద్యార్థినిపై జరిగిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇందులో జూనియర్ డాక్టర్లు కారుణ్య, అశ్విని, నిహారిక, ప్రియాంక, ప్రసన్న, అభినయ, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ నమోదు తప్పనిసరి


డీలర్లతో సమీక్షిస్తున్న డీఎస్‌వో కిరణ్‌కుమార్

కైలాస్‌నగర్: ప్రతీ వినియోగదారుడితో ఈకేవైసీ నమోదు చేయించి అర్హులైన వారిని మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500కే సిలిండర్ ప్రయోజనం పొందేలా చూడాలని డీఎస్‌వో కిరణ్‌కుమార్ అన్నారు. తన కార్యాలయ చాంబర్‌లో జిల్లాలోని ఎల్‌పీజీ డీలర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. పట్టణ ప్రాంతాల్లో డెలివరీ బాయ్స్‌తో ఈకేవైసీ చేయించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీల వారీగా యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. ఇందులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు రాథోడ్ బాబుసింగ్, ప్రేమ్ నివాస్, మధుసూదన్, రవీందర్ రాథోడ్, పుష్పమాల తదితరులు పాల్గొన్నారు.

శభాష్ శుభాంగి


సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

- ఏడు సబ్జెక్టుల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థిని

ఆదిలాబాద్‌టౌన్: కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీలేదని నిరూపించారు ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన శుభాంగి. పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో బీజెడ్‌సీ చదివి కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్ (సీపీగెట్)లో ఏడు సబ్జెక్టులకు సంబంధించి ఉత్తమ ర్యాంకులు సాధించారు ఈమె. చాలా మంది రెండు, మూడు సబ్జెక్టుల్లో రాణించగలుగుతారు. ఈమె మాత్రం పీజీ ఎంట్రెన్స్‌లో రాష్ట్ర స్థాయిలో వృక్షశాస్త్రంలో 6వ ర్యాంక్, హిందీలో 25వ ర్యాంక్, జంతుశాస్త్రంలో 27వ ర్యాంక్, ఇంగ్లిష్‌లో 57వ ర్యాంక్, జర్నలిజంలో 107 వ ర్యాంక్, ఆర్థిక శాస్త్రంలో 117వ ర్యాంక్, రసాయన శాస్త్రంలో 1713వ ర్యాంక్ సాధించి శభాష్ అనిపించుకున్నారు. శుభాంగి తండ్రి మనీష్ చంద్ర అగర్వాల్ పట్టణంలో వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం కళాశాల యాజమాన్యం విద్యార్థినితో పాటు తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఇందులో ప్రిన్సిపాల్ జగ్‌రాం అంతర్వేది , లెక్చరర్లు సంగీత, అరుణ్ కుమార్, శ్రావణి, సంతోష్ కుమార్, అష్రఫ్ అలీ, రాజ్‌కుమార్, రమేశ్, శ్రీనివాస్, రమాకాంత్, తదితరులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా విజయవంతం చేయాలి

ఆదిలాబాద్: హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి చేపట్టిన తిరంగా యాత్రను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తిరంగా యాత్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు.

పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో..

హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. పోస్టల్ సూపరింటెండెంట్ సిద్ధార్థ మాట్లాడుతూ పంద్రాగస్టు రోజున ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని కోరారు. ఇందులో పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.


తిరంగా యాత్రలో పాల్గొన్న ఎంపీ గోడం నగేశ్, ఇతర నాయకులు

అర్జీల వెల్లువ


అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

- ప్రజావాణికి పోటెత్తిన అర్జీదారులు
- కిటకిటలాడిన సమావేశ మందిరం
- దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: ప్రజల సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి అర్జీదారులు పోటెత్తారు. రెండు వారాల విరామం అనంతరం నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చారు. వినతులు అందజేసేందుకు క్యూ కట్టారు. వారి నుంచి కలెక్టర్ రాజర్షి షా అర్జీలు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను అందుబాటులో ఉన్న అధికారులకు అందించి పరిష్కరించాలని ఆదేశించారు. భూ సమస్యలు, పింఛన్లు, వసతిగృహాల్లో సీట్లు, స్వయం ఉపాధి, రుణాలు వంటి తదితర సమస్యలకు సంబంధించి ఈ వారం 166 అర్జీలు అందాయి. ఉదయం 11గంటలకు ప్రారంభమైన అర్జీల స్వీకరణ మధ్యాహ్నం 2.30గంటల వరకు కొనసాగింది. కలెక్టర్ బయలుదేరే సమయంలోనూ పలువురు రాగా ఓపికతో వారి అర్జీలను బయటే స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఆర్డీవో సాయన్న, ఆర్డీవో వినోద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ వారం అర్జీదారుల్లో కొందరి నివేదన.

వీవీలను నియమించాలి

కైలాస్‌నగర్: ఇటీవల జరిగిన బదిలీల ప్రక్రియతో జిల్లాలోని అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందని, వారి స్థానాల్లో విద్యావలంటీర్లను నియమించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ రాజర్షి షాను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇతర జిల్లాల్లో వీవీలను నియమించారని అదే తరహాలో జిల్లాలోనూ చర్యలు చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. అలాగే ఉపాధ్యాయులపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ మానసిక ఆందోళనకు గురిచేస్తున్న డీఈవోపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

తిరిగి విధుల్లోకి తీసుకోవాలి



గత ప్రభుత్వ హయాంలో అతి తక్కువ వేతనంతో 2016 నుంచి 2021వరకు జిల్లావ్యాప్తంగా 650 మందిమి పారిశుధ్య కార్మికులుగా పనిచేశాం. 2021లో బీఆర్ఎస్ ప్రభుత్వం మమ్మల్ని విధుల నుంచి తొలగించింది. తిరిగి తీసుకోవాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలను ఆదేశిస్తూ జీవో జారీ చేసింది. అయితే కొత్త వారికి బదులు ఇది వరకు పనిచేసిన మమ్మల్నే తిరిగి విధుల్లోకి తీసుకుని ఆదుకోవాలి.

– పాఠశాల పూర్వ పారిశుధ్య కార్మికులు

కనీస సౌకర్యాలు కల్పించండి



మేముంటున్న కుమ్మరికాలనీలో విద్యుత్ స్తంభాలు, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు వంటి ఎలాంటి మౌలిక వసతుల్లేవు. వర్షాలకు రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. రాత్రివేళల్లో అవస్థలు పడాల్సి వస్తుంది. కౌన్సిలర్‌కు పలుమార్లు విన్నించగా మున్సిపల్ నుంచి నిధులు రావడం లేదని చెబుతున్నారు. సౌకర్యాలు కల్పించి మా ఇబ్బందులు దూరం చేయాలి.

– బంగారుగూడ కాలనీవాసులు, ఆదిలాబాద్

'గృహజ్యోతి' అందట్లేదు

మేము ముత్నూర్‌తండా పంచాయతీ పరిధిలోని సర్కువాయిగూడెనికి చెందిన కొలాం గిరిజనులం. కూలీనాలి చేసుకుంటే తప్ప పూటగడువని పరిస్థితి. గూడెంలో 15 కుటుంబాలు ఉండగా గృహజ్యోతి కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నం. అయితే ఇద్దరికి మాత్రమే వర్తింపజేశారు. మిగతా వారికి ఉచిత విద్యుత్ ప్రయోజనం అందడం లేదు. అధికారులు పట్టించుకోవడం లేదు. మాకు న్యాయం చేయాలి.

– గిరిజన మహిళలు, గుడిహత్నూర్



విద్యుత్ సరఫరా నిలిపివేశారు



మా పంట చేలల్లో బోర్లు ఉన్నాయి. అయితే విద్యుత్ శాఖ అధికారులు మా చేలకు సరఫరా అయ్యే విద్యుత్ కనెక్షన్లను కట్ చేశారు. మూడు నెలలుగా కరెంట్ సరఫరా లేక పంటలకు నీరందించేందుకు తిప్పలు పడుతున్నాం. ఏఈతో పాటు ఆ శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. విద్యుత్ సరఫరా పునరుద్ధరించేలా చర్యలు తీసుకుని న్యాయం చేయాలి.

– రైతులు, భీంసరి, ఆదిలాబాద్ రూరల్

క్లుప్తంగా

శతాధిక వృద్ధుడు మృతి


దేవిదాస్(ఫైల్)

తాంసి: మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధుడు ఉపలంచి దేవిదాస్ (102) సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. దేవి దాస్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఇంటి వద్ద మృతి చెందాడు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

నిర్మల్‌టౌన్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని సార్థ్ మహల్‌కు చెందిన సయ్యద్ అహ్మద్ ప్లాస్టిక్ కవర్లలో గంజాయి అమ్ముతుండగా తమకు అందిన సమాచారం మేరకు ఎస్సై రమేశ్ సిబ్బందితో కలిసి వెళ్లి పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 450 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని విచారించగా స్థానిక విశ్వనాథ్ పేట్ కాలనీకి చెందిన అబ్దుల్ ముక్తార్ వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపాడు. ముక్తార్ వద్ద నుంచి 1100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతన్ని విచారించగా మహారాష్ట్రలో గుర్తు తెలియని వ్యక్తి నుండి కొనుగోలు చేసినట్లు తెలిపాడు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలోంచి గొలుసు అపహరణ

సర్సాపూర్(జి): మండలంలోని తురాటి గ్రామానికి చెందిన గడ్డం లింగవ్వ మెడలోంచి రెండు తులాల బంగారు గొలుసు అపహరణకు గురైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...లింగవ్వ నిర్మల్‌లో బస్సు ఎక్కి తురాటి బస్టాప్ వద్ద దిగింది. గ్రామానికి నడుచుకుంటూ వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మెడలోంచి గొలుసు లాక్కెళ్లారు. గొలుసు విలువ రూ.లక్ష 40 వేలు ఉంటుందని బాధితురాలు వాపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

కుక్కల దాడిలో 2 గొర్రెలు, మేక మృతి

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన యుముండ్ల రాజన్న గొర్రెల పాకపై ఆదివారం రాత్రి ఊర కుక్కలు దాడి చేయడంతో రెండు గొర్రెలతో పాటు ఒక మేక మృతి చెందింది. మరో నాలుగు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. రూ.50 వేల వరకు నష్ట పోయానని బాధిత రైతు వాపోయాడు. పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

కడెం: మండలంలోని అల్లంపెల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అద్దాల తిమ్మాపూర్‌లో రహదారిపై 11కేవీ విద్యుత్ స్తంభానికి ఉన్న సపోర్టు వైరును తాకడంతో విద్యుదాఘాతానికి గురై దుక్కిటెద్దు మృతి చెందింది. ఎద్దు విలువ రూ.40 వేలు ఉంటుందని అల్లంపెల్లి గ్రామానికి చెందిన బాధిత రైతు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి వాపోయాడు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

లెఫ్టా.. రైటే!




మామడ మండలంలోని పరిమండల్ జెడ్పీ పాఠశాల విద్యార్థులు

- కొందరికి పుట్టుకతోనే ఎడమచేతి వాటం..
- లెఫ్ట్ హ్యాండర్సే ప్రత్యేక ప్రతిభావంతులంటున్న నిపుణులు
- ప్రత్యేకత చాటుతున్న లెఫ్ట్ హ్యాండర్స్
- నేడు ప్రపంచ లెఫ్ట్ హ్యాండర్స్ డే

నిర్మల్‌ఖిల్లా: సాధారణంగా సమాజంలోని ప్రతీ వ్యక్తి ప్రత్యేక భిన్నమైన గుణం కలిగి ఉంటాడు. అయితే కొందరిలో వారి ప్రత్యేకతను బట్టి ఇట్టే గుర్తుపట్టొచ్చు. ప్రతీ వందమందిలో 90 మంది కుడిచేతివాటం వారు ఉండగా మిగతా 10 శాతం మందిలో చాలా లెఫ్ట్ హ్యాండర్స్ కనిపిస్తుంటారు. కుడిఎడమైతే పొరపాటు లేదోయ్.. అన్నాడో సినీ కవి.. అంటే వ్యక్తిలోని భిన్నత్వాన్ని బట్టి ఆ వ్యక్తికి ప్రత్యేకతను ఆపాదిస్తాం. ఎడమ చేతివాటం అనేది జన్యు ప్రభావ ఫలితంగా ఏర్పడిందని వైద్య పరిశోధనల్లో రుజువైంది. నేడు ప్రపంచ లెఫ్ట్ హ్యాండర్స్ డే సందర్భంగా కథనం.

భిన్నమైన శైలి...

కుడిచేతివాటం వారి కన్నా ఎడమచేతివాటం వారు ప్రత్యేక స్థానాల్లో ఉంటారని, వారి మేధోశక్తి ఆలోచనలు, తెలివితేటలు భిన్నంగా ఉంటాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచంలో గుర్తింపు పొందిన మేధావుల్లో చాలామంది ఎడమ చేతి వాటం కలిగిన వారే కావడం విశేషం. ప్రస్తుత భారత ప్రధాని నరేంద్ర మోదీ సైతం ఎడమ చేతితోనే రాస్తారు. ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు సచిన్ టెండూల్కర్, యువరాజు సింగ్, సినీ నటులు అమితాబ్ బచ్చన్, సావిత్రి లాంటివారు లెఫ్ట్ హ్యాండర్స్ వారే కావడం గమనార్హం. ఎడమచేతి వాటం వారిలో సృజనాత్మకత, సంగీతం, కళలు, అభినయం, గ్రహణశక్తి సామర్థ్యాలు, భావవ్యక్తీకరణ నైపుణ్యాలు అమితంగా ఉంటాయని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి.

మాన్పించవద్దు..

ఏడాదిన్నర నుంచి రెండేళ్ల మధ్య వయసులో ఉన్నప్పటి నుండి పిల్లలు వస్తువులను పట్టుకోవడం మొదలుపెడతారు. ఈ సమయంలోనే కుడి, ఎడమ చేత వాటాలను గుర్తించవచ్చు. ఎడమ చేతి వాటాన్ని తల్లిదండ్రులు ఒక చెడు అలవాటుగా భావించి మాన్పించేందుకు ప్రయత్నం చేస్తారు. అలా చేయడం వల్ల ఇతర సమస్యలు తలెత్తుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కుడి చేత్తో రోజువారి పనులు చేసుకోవడం సహజమే. అయితే ఆ పనులను ఎడమ చేత చేయడం కాస్త ఛాలెంజ్‌తో కూడుకున్నది. రోజువారీ పనులన్నీ ఎడమచేత్తో చేస్తూ ప్రత్యేకంగా పేరొందిన వారి జాబితాలో మనదేశం చాలా పెద్దది. అందులో సైంటిస్టులు, క్రీడాకారులు, తత్వవేత్తలు, వ్యాపారవేత్తలు, రాజకీయవేత్తలు చాలామంది ఉన్నారు. ప్రతి 10 మందిలో ఒకరు ఎడమ చేతివాటం ఉన్న వారేనని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.

జన్యు ప్రభావ ఫలితంగానే...

ప్రతీ వ్యక్తి పుట్టినప్పటి నుండే కుడి, ఎడమ చేతి వాటాలను సహజసిద్ధంగానే కలిగి ఉంటాడని సైన్స్ చెబుతోంది. ఒక మనిషికి మెదడు కుడి ఎడమ రెండు అర్ధ భాగాలుగా ఉంటుంది. కుడి వైపు శరీర భాగాన్ని మెదడు ఎడమవైపు భాగం నియంత్రిస్తుందని, కుడి అర్ధ భాగం మెదడు బలంగా ఉన్న వారిలో ఎడమ చేతి వాటం వస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. చిన్నప్పటినుండే తల్లిదండ్రులు ఎడమ చేతి వాటం గమనిస్తే మాన్పించేందుకు ప్రయత్నం చేస్తారు. జన్యుపరమైన మార్పులు ఉన్నప్పుడు అలా మాన్పించడం సాధ్యంకాదు.

ఒకే తరగతిలో ఐదుగురు...

నిర్మల్ జిల్లా మామడ మండలం పరిమండల్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాలుగో తరగతిలో దాదాపు 22 మంది ఉండగా అందులో ఐదుగురు ఎడమ చేతి వాటం కలిగిన వారే ఉండడం విశేషం. వీరు హోం వర్క్, పెయింటింగ్స్, రాతపని ఏది చేయాలన్నా ఎడమ చేతితోనే చేస్తారు. శ్రీకృతి, శ్రీహరి, సిద్ధార్థ, సమాధాన్, వర్షిత్ అనే పదేళ్లలోపు చిన్నారులతో పాటు మరో ముగ్గురు విద్యార్థులు ఎడమ చేతి వాటం కలిగి ఉన్నారు. వారంతా చదువు, రాత పనుల్లో చురుకుదనం కలిగి ఉన్నట్లు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. డ్రాయింగ్, పెయింటింగ్‌లో నైపుణ్యం కలిగి ఉన్నారు.

జన్యు ప్రభావంతోనే..



గర్భస్థ దశలో శిశువు ఉన్నప్పుడు ఏర్పడిన జన్యు ప్రభావంతోనే ఎడమచేతివాటంతో జన్మిస్తారు. పుట్టినప్పటి నుండే ప్రతీపనిని ఎడమచేతితో చేసేందుకు ప్రయత్నిస్తారు రెండేళ్ల తర్వాత తల్లిదండ్రులు ఈ విషయాన్ని గ్రహించవచ్చు. దానిని మాన్పించే ప్రయత్నం చేయకూడదు. ఎడమ చేతివాటం ఉండడం వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు.

– నాలం స్వప్న, చిన్న పిల్లల వైద్య నిపుణులు, నిర్మల్


ఊహ తెలిసినప్పటి నుంచి..



నాకు ఊహ తెలిసినప్పటి నుంచి లెఫ్ట్ హ్యాండ్ తోనే రాయడం, ఇతర పనులు చేయడం అలవాటైంది. తల్లిదండ్రులు కూడా ఎడమచేతివాటాన్ని ప్రోత్సహించారు. ఇప్పటి వరకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదు. సహజసిద్ధంగా ఏర్పడిన ఈ అలవాటును ఇలాగే కొనసాగిస్తున్నా.

– మాకునూరి గిరిబాబు, కంప్యూటర్ ఆపరేటర్, సిర్గాపూర్

ఎడమ చేతితోనే ...



ప్రస్తుతం నేను ప్రైవేటు ఉద్యోగిగా అకౌంట్స్ పనులు నిర్వహిస్తున్నా. చిన్నప్పటినుండి ఎడమ చేతితోనే రాయడం, పనులు చేయడం అలవాటైంది. కుడి చేతి కంటే కూడా ఎడమ చేతికి చలన నైపుణ్యాలు ఎక్కువగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఏ పని చేయాలన్నా సహజసిద్ధంగానే ఎడమచేయి ముందుకు వెళ్తుంది. ఏ పని మొదలెట్టినా ఎడమ చేతితోనే చేస్తాను.

– గాంధ్ల లక్ష్మణ్, ప్రైవేటు ఉద్యోగి, కౌట్ల

చట్టాలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న నైతం బాలు

నార్నూర్: ఏజెన్సీ చట్టాలను అతిక్రమిస్తూ ఆదివాసీ గిరిజనుల హక్కులను కాలరాస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నైతం బాలు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని కుమురం భీం భవన్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండల కేంద్రంలోని జిన్‌గూడలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని పరిశీలించినట్లు తెలిపారు. 1/59, 1/70 చట్టానికి విరుద్ధంగా కొంతమంది గిరిజనేతరులు రాత్రికి రాత్రే ప్రభుత్వ భూమి అయిన గుట్ట ప్రాంతాన్ని డోజర్ల ద్వారా తవ్వుకుని కబ్జా చేస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి ఆర్క గోవింద్ అధికారులకు ఫోన్ చేసినా స్పందించలేదన్నారు. తక్షణమే అక్రమ తవ్వకాలను నిలిపివేసి బాధితులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి షెడ్మాకి రామారావు, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు మడావి మనోహర్, జిల్లా గౌరవ అధ్యక్షుడు మెస్రం శేకు, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్రు, అర్క గోవింద్, నాయకులు కుమ్ర జైతూ పాల్గొన్నారు.

ఉద్యానవన పాలిటెక్నిక్‌లో అడ్మిషన్లు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయంలోని ఉద్యానవన పాలిటెక్నిక్ డిప్లమాలో అడ్మిషన్లకు వాక్ ఇన్ అడ్మిషన్ ప్రక్రియ చేపడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశాల కోసం విద్యార్థులు హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు పదో తరగతి, కుల, ఆదాయ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. సీట్ వచ్చిన విద్యార్థులు వెంటనే ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, 22 సంవత్సరాల లోపు ఉన్న వారు మాత్రమే అర్హులన్నారు. 6304749921 నంబరులో సంప్రదించాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా


అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఉట్నూర్ మండలం పాత ఉట్నూర్‌కు చెందిన గేడం శిరేఖ ఉద్యోగ అవకాశం కల్పించాలని, నార్నూర్ మండలం గంగాపూర్‌కు చెందిన చౌహన్ బన్ని ల్యాప్‌టాప్ ఇప్పించాలని, వాంకిడి మండలం లింగాడకు చెందిన ఆత్రం రాము ఇల్లు మంజూరు చేయించాలని, మామడ మండలానికి చెందిన లక్ష్మి తమ భూమికి పట్టా చేయించాలని అర్జీలు అందజేశారు. ఇంకా పింఛన్, రెండు పడకల గదుల ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయం, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఏపీవో వసంత్‌రావు, జీసీసీ డీఎం రామనందన్, అదనపు వైద్యాధికారి మనోహర్, పీహెచ్‌వో సందీప్‌కుమార్, ఆర్సీవో రాజ్యలక్ష్మి, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని మృతదేహం

నిర్మల్‌రూరల్: మండలంలో ని రత్నాపూర్ కాండ్లీలో సో మవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు రూరల్ ఎస్సై సాయికుమా ర్ తెలిపారు. బస్సు షెల్టర్‌లో గుర్తు తెలియని వ్యక్తి (40) పడిపోయి ఉన్నట్లు గ్రామస్తులు సమాచారం ఇచ్చారన్నారు. మృతుడు తెలుపు రంగు షర్ట్, నీలిరంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, భిక్షాటన చేసే వ్యక్తిగా అనుమానం వ్యక్తం చేశారు. గుర్తు పట్టిన వారు నిర్మల్‌రూరల్ పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి

ఇచ్చోడ: మండలంలోని హెచ్‌పీగ్యాస్ ఏజెన్సీస్ 44వ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. మృతి చెందిన మహిళ 50 నుంచి 55 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నార్నూర్: మండల కేంద్రం నుంచి తాడిహత్నూర్ వెళ్లే రోడ్డుపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు బీఆర్ఎస్ నాయకులకు గాయాలయ్యాయి. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఫిరోజ్ ఖాన్, నాయకుడు సుల్తాన్ ఖాన్ ద్విచక్ర వాహనంపై తాడిహత్నూర్ నుంచి నార్నూర్‌కు వస్తుండగా నూతనంగా నిర్మించిన వంతెన వద్ద బైక్ అదుపు తప్పి కింద పడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో ముందుగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం ఉట్నూర్ ఆస్పత్రికి తరలించారు.

వైర్లు దొంగిలించిన వ్యక్తి అరెస్టు

లక్ష్మణచాంద: బోరు మోటారు వైర్లు దొంగిలించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సోన్ సీఐ నవీన్ కుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. చామన్‌పెల్లికి చెందిన లోకిని వరుణ్(28)జల్సాలకు అలవాటుపడ్డాడు. ఈ నెల 10న మండలంలోని మాచాపూర్ గ్రామ శివారులో రైతులకు చెందిన 9 మోటార్ల విద్యుత్ తీగలను దొంగిలించాడు. రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్న పోలీసులు సోమవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

ఇంద్రవెల్లి: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ముత్నూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై దుబ్బక సునీల్ తెలిపిన వివరాల ప్రకారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలోని మంగి గ్రామానికి చెందిన మడావి సుకుమార్ (21) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. ఈ నెల 11న ఉట్నూర్ వెళ్తానని ఇంట్లో తల్లికి చెప్పి వెళ్లి అదేరోజు సాయంత్రం ముత్నూర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లి పురుగుల మందుతాగి తల్లికి సమాచారం అందించాడు. వెంటనే తల్లి గౌరుబాయి ముత్నూర్‌లో ఉన్న బంధువులకు ఫోన్‌చేసి విషయం చెప్పడంతో ప్రైవేటు వాహనంలో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఎస్సై సోమవారం రిమ్స్ ఆస్పత్రిని సందర్శించి మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. గౌరుబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

హత్యాయత్నం చేసిన వ్యక్తి అరెస్ట్

తాంసి: పాతకక్షలతో వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు భీంపూర్ ఎస్సై కలీం తెలిపారు. భీంపూర్ మండల కేంద్రానికి చెందిన సంతోశ్‌పై ఆదివారం రాత్రి అదే గ్రామానికి చెందిన సిడాం అర్జున్ పాతకక్షలతో కొడవలితో దాడి చేసి హత్యాయత్నం చేశాడు. ఘటనలో సంతోశ్‌కు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

సేవాగ్రామ్‌ను సందర్శించిన మంత్రి సీతక్క


స్టాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

కైలాస్‌నగర్: రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సోమవారం మహాత్మా గాంధీ స్థాపించిన మహారాష్ట్రలోని సేవాగ్రామ్‌ను సందర్శించారు. ఆశ్రమంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల స్టాళ్లను పరిశీలించారు. నచ్చిన పలు వస్త్రాలను కొనుగోలు చేశారు. ఆదివారం రాత్రి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రజాసేవభవన్‌కు చేరుకున్నారు. ఆమెకు కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. రాత్రికి అక్కడే బసచేసిన మంత్రి సోమవారం ఉదయం సేవాగ్రామ్‌కు బయలుదేరి వెళ్లారు.

నాందేవ్‌ను భారత్ రప్పించాలని వినతి

ముధోల్: కువైట్‌లో ఇబ్బందులు పడుతున్న మండలంలోని రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నాందేవ్‌ను స్వదేశానికి రప్పించాలని అతని భార్య లక్ష్మి, కుమారుడు శ్రీకాంత్ సోమవారం బాల్కొండ మాజీ ఎమ్మెల్యే, టీఎస్ఎండీసీ చైర్మన్ అనీల్, టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ భీంరెడ్డి, టీజీఎస్ ముధోల్ నియోజక వర్గ ఇన్‌చార్జి సర్దార్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరహరిగౌడ్, నరేందర్, రంజిత్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

'హిట్ అండ్ రన్' కేసులో నిందితుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నవీన్ కుమార్

సోన్: ఇటీవల గంజాల్ టోల్ ప్లాజా సమీపంలో జరిగిన 'హిట్ అండ్ రన్' కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నవీన్ కుమార్, ఎస్సై గోపి తెలిపారు. మీరట్ ఉత్తరప్రదేశ్ నుండి బ్యాగుల లోడ్‌తో విజయవాడకు వెళ్తున్న జేకే లాజిస్టిక్ కంపెనీకి చెందిన కంటైనర్ డ్రైవర్ రహీస్, క్లీనర్ వశీమ్ ఖాన్ ఈనెల 9న తెల్లవారుజామున జాఫ్రాపూర్ ఎక్స్‌రోడ్ వద్ద కడ్తల్ గ్రామానికి చెందిన భోగ నారాయణ (63)ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన లారీ డ్రైవర్, క్లీనర్ లారీతో సహ పరారయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు బృందాలుగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితులను అరెస్టు చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వానిది రెండు నాల్కల ధోరణి

- ఎంపీ గోడం నగేష్


మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేష్

ఆదిలాబాద్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర బడ్జెట్ కేటాయింపుల విషయంలో రెండు నాల్కల ధోరణి ప్రదర్శిస్తుందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాలకు పెద్దపీట వేస్తూ కేటాయింపులు జరిపిందన్నారు. ఇది సమగ్రమైన బడ్జెట్ అని మేధావులు సైతం విశ్లేషించారన్నారు. బడ్జెట్లో తెలంగాణను విస్మరించారని, రాష్ట్రం పేరు ప్రస్తావించలేదనడం విడ్డూరంగా ఉందన్నారు. శాఖల వారీగా పద్దుల కేటాయింపు జరుగుతుందని, ఈ విషయం తెలిసినప్పటికీ అనవసర విమర్శలు చేయడం సరికాదన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న సమస్యల విషయంలో కేంద్ర మంత్రులకు విన్నవించామన్నారు. ఆదిలాబాద్-పటాన్ చెరు రైల్వేలైన్ పనులు పూర్తి కావచ్చాయన్నారు. గతంలో ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వే లైన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నిధులను కేటాయించడం జరిగిందని, గత ప్రభుత్వం 50 శాతం నిధులు కేటాయించడం విషయంలో ఒప్పందం చేసుకోకపోవడంతో ఈ రైల్వే లైన్ ఆగిందన్నారు. జిల్లాలో నిర్మించనున్న 353 బి నేషనల్ హైవేకు సంబంధించి భూసేకరణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సి ఉందని వివరించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, ప్రధాన కార్యదర్శి ఆదినాథ్, జోగురవి, విజయ్, ధోని జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ధైర్యంగా అడుగేద్దాం.. ఆనందంగా చదివేద్దాం


అవగాహన కల్పిస్తున్న స్పెషల్ ఆఫీసర్ సృజన

భైంసా: విద్యార్థులు యూనివర్సిటీలో ధైర్యంగా అడుగేసి ఆనందంగా చదవాలని స్పెషల్ ఆఫీసర్ సృజన అన్నారు. బాసర ట్రిపుల్‌ఐటీ పీయూసీ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ ఆదేశాల మేరకు మూడు రోజులపాటు ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆరు సంవత్సరాలు పట్టుదలతో చదివితే ఉజ్వల భవిష్యత్ మీదేనన్నారు. ఆర్జీయూకేటీ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే విద్యాసౌధమని కొనియాడారు. ఇక్కడ చదివిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు, ఉన్నత విద్య రంగాల్లో రాణిస్తున్నారని వివరించారు. అసోసియేట్ డీన్స్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి తప్పనిసరిగా 75 శాతానికి పైగా హాజరు ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి కొత్తగా యూనివర్సిటీలో ప్రవేశించే విద్యార్థులు భయంతో ఉండడం సహజమేనని, ఇలాంటి వారిలో భయాన్ని పోగొట్టి భరోసా కల్పించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్స్ డాక్టర్ పావని, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ దత్తు, మహేష్, వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ దేవరాజు, ఏ.విజయ్ కుమార్, సురేష్, డాక్టర్ రమాదేవి, చీఫ్ వార్డెన్ శ్రీధర్, అడిషనల్ చీఫ్ వార్డెన్ అనుపమ శ్రీదేవి, డాక్టర్ సుజాత, కార్యక్రమ సమన్వయకర్త గజ్జల శ్రీనివాస్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

ఒక్కో బెడ్‌పై ఇద్దరికి చికిత్స





ఇటీవల కురిసిన వర్షాలతో సీజనల్ వ్యాధుల తీవ్రత పెరిగింది. దీంతో జిల్లాలోని నలుమూలల నుంచి రోగుల సంఖ్య భారీగా పెరుగుతోంది. రోగులకు సరిపడా బెడ్లు లేకపోవడంతో ఒక్కో బెడ్‌పై ఇద్దరేసి రోగులకు చికిత్స అందిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో గల ఫీమేల్ (మహిళ) వార్డులో జ్వరపీడితులు చేరుతున్నారు. ఒకే బెడ్‌పై ఇద్దరు ఉండడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఆ చిత్రాలే ఇవి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్